
సాక్షి
కుమురం భీం

సోమవారం ; 26 ; ఫిబ్రవరి ; 2024



సల్లంగ సూడమ్మా..
మందమర్రి మండలం బొక్కలగుట్ట శివారు లోని గాంధారీ ఖిల్లా వద్ద మూడు రోజులుగా నిర్వహిస్తున్న గాంధారీ మైసమ్మ జాతర ఆదివారం పెద్దపూజతో ముగిసింది. 8లో▸



మరమ్మతులు చేపట్టరూ..!
గతంలో కురిసిన భారీ వర్షాలకు ఒర్రెలు, వాగులు ఉప్పొంగి వాంకిడి మండలంలోని వివిధ గ్రామాలకు వెళ్లే రహదారులు, వంతెనలు, కల్వర్టులు ధ్వంసమయ్యాయి. 9లో▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం
32.0 /21.6
ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి. వేకువ జామున చల్లగా ఉంటుంది. మధ్యాహ్నం వేడిగా, ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటుపై హర్షం

ఆసిఫాబాద్‌రూరల్: జీవో 317 సమస్యలపై మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటు చేయడం హర్షనీయమని యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శాంతికుమారి, ఇందు రావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జీవో 317 ద్వారా అమలు చేసిన ఉద్యోగుల విభజనలో ఏర్పడిన సమస్యలను అధ్యయనం చేసి పరిష్కారాలను సిఫారసు చేయడం కోసం జీవో 292 ద్వారా ఆరోగ్యశాఖ మంత్రి రాజనర్సింహ అధ్యక్షతన మంత్రులు శ్రీధర బాబు, ప్రభాకర్ సభ్యులుగా మంత్రివర్గ ఉప సంఘాన్ని ఏర్పాటు చేయడం సంతోషకారంగా ఉందని తెలిపారు. ఈ జీవోతో ఉపాధ్యాయులు చాలా ఇబ్బందులు పడుతున్నారని వివరించారు.

భారతీయ ఆదివాక్త పరిషత్ జిల్లా కమిటీ ఎన్నిక



ఎన్నికైన కమిటీ సభ్యులు

ఆసిఫాబాద్‌రూరల్: పేద ప్రజలకు ఉచిత న్యాయ సలహాలు అందిస్తూ న్యాయ వ్యవస్థలో మార్పులు అభివృద్ధి చేసే దిశగా భారతీయ ఆదివాక్త పరిషత్ పనిచేస్తోందని రాష్ట్ర న్యాయవాద పరిషత్ కోశాధికారి మంగులాల్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రం బార్ అసోసియేషన్‌లో భారతీయ ఆదివాక్త పరిషత్ జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా రవీందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా లేకురే నగేష్, ఉప అధ్యక్షుడిగా గాయత్రి, చరణ్‌తేజ, సతీష్, కార్యదర్శులుగా గణేష్, ఆకాష్, కమిటీ సభ్యులుగా వెంకటేశ్వర్, రవీందర్, చంద్రకుమార్, సతీష్, స్వప్నలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

రోడ్ల దుస్థితిపై బీఎస్పీ నిరసన

కాగజ్‌నగర్‌రూరల్: కాగజ్‌నగర్–సిర్పూర్ ప్రధాన రహదారిలోని కోసిని గ్రామంలోని పూలే విగ్రహాల వద్ద సోమవారం ఉదయం బీఎస్పీ ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహిస్తున్నట్లు బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు లెండుగురె శ్యాంరావు ఆదివారం తెలిపారు. కోసిని గ్రామంలోని రోడ్లు అధ్వాన్నంగా మారాయని, అయినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని దీనికి నిరసనగా రాస్తారోకో చేపడుతున్నట్లు వివరించారు. ఈ రాస్తారోకోలో అధిక సంఖ్యలో బీఎస్పీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఆలయానికి విద్యుత్ పునరుద్ధరణ

కౌటాల: మండలంలోని తాటిపల్లి గ్రామ సమీపంలో గల వార్దా నది ఒడ్డున గల శ్రీ సిద్ధి హనుమాన్ ఆలయానికి విద్యుత్ అధికారులు ఆదివారం విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు. ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో హనుమాన్ ఆలయానికి విద్యుత్ సరఫరా లేదని ఎంపీటీసీలు ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు దృష్టికి తీసుకెళ్లారు. మార్చి 8న ఆలయంలో మహాశివరాత్రి పురస్కరించుకొని మహా జాతర ఉంటుందన్నారు. స్పందించిన ఎమ్మెల్యే విద్యుత్ సరఫరా పునరుద్ధరించాలని విద్యుత్ అధికారులను ఆదేశించారు. ఆదివారం విద్యుత్ ఏఈ రవీందర్, లైన్‌ఇన్స్‌పెక్టర్ అరవింద్, సిబ్బంది వెళ్లి ఆలయానికి విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు.

రేపు శివాలయంలో జాతర వేలం

రెబ్బెన: మహాశివరాత్రి పురస్కరించుకొని నంబాలలో గల ప్రసన్న పరమేశ్వర ఆలయంలో నిర్వహించనున్న జాతర సందర్భంగా మంగళవారం ఆలయ ప్రాంగణంలో జాతర వేలం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ ఒక ప్రకటనలో తెలిపారు. జాతరలో కొబ్బరి కాయల విక్రయం, తైబజార్ నిర్వహణ, వాహనాల పార్కింగ్ నిర్వహణ కోసం మంగళవారం ఉదయం 11 గంటలకు ఆలయ ఆవరణలో వేలం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆసక్తి గలవారు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలి

సిర్పూర్(టి): జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూ నియర్ కళాశాలలో సోమవారం నిర్వహించనున్న మెగా జాబ్‌మేళాను మండల యువతీ, యువకులు సద్వినియోగం చేసుకోవాలని ఎస్సై దీకొండ రమేశ్ ఒక ప్రకటనలో తెలి పారు. 10వ తరగతి, ఇంటర్మీడియెట్, పాలిటెక్నిక్, డిగ్రీ, పీజీ, ఎంబీఏ, ఎంసీఏ, బీటెక్, ఎంటెక్, ఫార్మసీ తదితర కోర్సులు పూర్తి చేసిన యువత మెగా జాబ్‌మేళాలో పాల్గొని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఇంటర్ పరీక్షలకు సన్నద్ధం

- 28 నుంచి పరీక్షలు
- జిల్లాలో 19 సెంటర్లు, 10,423 విద్యార్థులు
- ఆరేళ్లుగా రాష్ట్రంలో టాప్ 5లో జిల్లా
- ఇదే జోరును కొనసాగిస్తామంటున్న డీఐఈవో



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఐఈవో

ఆసిఫాబాద్‌రూరల్: విద్యార్థి భవిష్యత్ మలుపు తిప్పే ఇంటర్మీడియట్ పరీక్షలు ఈ నెల 28 నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ పరీక్షలకు జిల్లాలో 19పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 48 కళాశాలల్లో 10,423 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. పరీక్ష కేంద్రాల్లో ఇబ్బందులు లేకుండా మంచి నీరు, ప్యా న్లు, మూత్రశాలలు, బెంచీలు వంటి సౌకర్యాలు కల్పించాలని ఇప్పటికే కలెక్టర్ సంబంధిత అధికారులకు సూచించారు. జిల్లాలో ఫిబ్రవరి 1 నుంచి ప్రాక్టికల్ పరీక్షలు ప్రారంభం కాగా ఈ నెల 28 నుంచి వార్షిక పరీక్షలు జరుగనున్నాయి.

జిల్లాలో 19 పరీక్ష కేంద్రాలు...
ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల కోసం జిల్లాలో 19 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. వీటిలో ఆసిఫాబాద్‌లో 5, ప్రభుత్వ కళాశాల, మోడల్ స్కూల్, గిరిజన బాలుర, బాలికల కళాశాల, సాంఘిక సంక్షేమ గురుకులం కాగజ్‌నగర్‌లో 3, ప్రభుత్వ కళాశాల, వివేకనంద, మహత్మాగాంధీ జ్యోతిబాపూలే బాలికల కళాశాలతో పాటు జైనూర్, సిర్పూర్, కౌటాల, బెజ్జూర్, తిర్యాణి, దహేగాం, కెరమెరి, రెబ్బెనలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఒక్కొక్కటి పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. జిల్లాలో మొత్తం 48 కళాశాలకు ప్రభుత్వ కళాశాలు 11, ప్రైవేట్ కళాశాలలు 5, 32 గురుకుల, మైనార్టీ కేజీబీవీ, మోడల్ స్కూల్స్ ఉన్నాయి. మొత్తం 10,423 మంది చదువుకుంటున్నారు. ఇంటర్ ప్రథమ సంవత్సరంలో జనరల్ 4,567 మంది ఒకేషనల్ 852 మంది, సెకండియర్‌లో జనరల్ 4,310 మంది, ఒకేషనల్‌లో 694 మంది విద్యార్థులు ఉన్నారు.

హాల్‌టికెట్ ఆన్‌లైన్‌లో..
పరీక్ష రాసే విద్యార్థులు తమ హాల్‌టికెట్‌ను ఆన్‌లైన్ ద్వారానే తీసుకోవచ్చు. హాల్ టికెట్‌తో నేరుగా పరీక్ష సెంటర్ రావచ్చు. పరీక్ష ఉదయం 9 నుంచి 12గంటల వరకు నిర్వహించే ఇంటర్మీడిట్ పరీక్షలకు విద్యార్థులు తమ హల్ టికెట్, పెన్నులు, ప్యాడ్ మినహించి ఎలాంటి ఎలక్ట్రానిక్ వస్తువులు, సెల్ ఫోన్ అనుమతి లేదు. అరగంట ముందే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలి. పరీక్ష ప్రశ్న పత్రాలను సీసీ కెమోరా నిఘాలో ఓపెన్ చేయాల్సి ఉంటుంది. మాస్ కాపింగ్‌కు పాల్పడకుండా ఫ్లైయింగ్ స్కాడ్ బృందం, డీటీ, ఏఎస్సై, అధ్యాపకులు, రెండు సిట్టింగ్ స్కాడ్ బృందాలు 3, సీఎస్, డీవోలు, ఇన్విజిలేటర్లు అదనపు కలెక్టర్, కలెక్టర్ పర్యవేక్షించనున్నారు.

ఆరేళ్లుగా రాష్ట్రంలో టాప్ 5లో జిల్లా...
ఇంటర్మీడియట్ ఫలితాల్లో ఆరేళ్లుగా జిల్లా విద్యార్థులు సత్తా చాటుతున్నారు. సమష్టి కృషితో ప్రభుత్వ కళాశాలల విద్యార్థులు ప్రైవేట్ కళాశాలలకు ధీటుగా ఫలితాలు సాధిస్తున్నారు. గత సంవత్సరం జిల్లా సెకండ్ స్థానంలో నిలిచింది. ఈసారి కూడా మంచి ఫలితాలు సాధిస్తామని డీఐఈవో శంకర్ తెలిపారు. 2019లో 80శాతంతో రాష్ట్రంలో 1, 2020లో 75 శాతంతో 2వ స్థానం, 2022లో 80శాతంతో 2వ స్థానం, 2023లో 81శాతంతో రాష్ట్రంలో రెండవ స్థానంలో కుమురంభీం నిలిచింది.

ఏర్పాట్లు పూర్తి చేస్తాం...



జిల్లా వ్యాప్తంగా 19 పరీక్ష కేంద్రాల్లో 10423 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. ఈసారి కూడా మంచి ఫలితాలు సాధించే విధంగా విద్యార్థులను సన్నద్ధం చేశాం.

– శంకర్, డీఐఈవో

మరో రెండు గ్యారంటీలకు శ్రీకారం..

- రూ.500కు గ్యాస్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్
- ఈ నెల 27న ప్రారంభించేందుకు ఏర్పాట్లు

ఆసిఫాబాద్: అసెంబ్లీ ఎన్నికల హామీల్లో భాగంగా కాంగ్రెస్ సర్కారు మరో రెండు గ్యారంటీల అమలుకు శ్రీకారం చుట్టింది. ఆరు గ్యారంటీల్లో భాగంగా ఇప్పటికే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలు చేస్తుండగా, గృహజ్యోతి పథకం కింద 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ.500కు వంట గ్యాస్ హామీలు అమలుకు శ్రీకారం చుడుతున్నారు. ఈ నెల 27న ప్రియాంక గాంధీ చేతుల మీదుగా రూ.500 గ్యాస్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకాలు ప్రారంభించనున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి మేడారం సమ్మక్క జాతరలో ప్రకటించారు. ఈ క్రమంలో ట్రాన్స్‌కో సీఎండీ శనివారం రాష్ట్రంలోని అన్ని జిల్లాల విద్యుత్ శాఖ అధికారులతో జిల్లాల వారీగా గృహజ్యోతి అమలుపై సమీక్షా సమావేశం నిర్వహించారు. గతేడాది డిసెంబర్ 28 నుంచి జనవరి వరకు ప్రజాపాలన సభల్లో అభయహస్తం దరఖాస్తులు స్వీకరించిన అధికారులు ఈ నెల 6 నుంచి 20వరకు జిల్లా వ్యాప్తంగా 180 మంది విద్యుత్ సిబ్బంది క్షేత్ర స్థాయిలో దరఖాస్తులు పరిశీలించారు. ఆధార్, రేషన్ కార్డు, విద్యుత్ బిల్లు, ఫోన్ నెంబర్‌తో పాటు ప్రజాపాలనలో ఇచ్చిన దరఖాస్తు నెంబర్‌ను ప్రత్యేక ఆప్‌లో నమోదు చేశారు. గృహజ్యోతి పథకం కింద జిల్లాలో 1,13,260 మంది వివరాలు ప్రత్యేక యాప్‌లో నమోదు చేశారు. రూ.500కు గ్యాస్ సిలిండర్ కోసం 38,954 దరఖాస్తులు రాగా, 38,949 దరఖాస్తులను క్షేత్ర స్థాయిలో పరిశీలించి, ప్రత్యేక యాప్‌లో నమోదు చేశారు. దీంతో దరఖాస్తుదారుల్లో పథకం అమలుపై ఆశలు రేకెత్తున్నాయి.

రేషన్‌కార్డు ప్రామాణికం..
అభయహస్తం పథకంలో భాగంగా ఆరు గ్యారంటీల్లోని 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ.500కు గ్యాస్ సిలిండర్ పథకాల అమలుకు ఆహారభద్రత (రేషన్‌కార్డు)ను ప్రామాణికంగా తీసుకుంటున్నట్లు సమాచారం. జిల్లాలో 1,39,757 ఆహార భద్రత కార్డులుండగా, వీటిలో 13,058 అంత్యోదయ అన్నయోజన కార్డులు, 1,26,699 ఆహారభద్రత కార్డులున్నాయి. వీటితో పాటు జిల్లాలో 1,66,774 విద్యుత్ కనెక్షన్లు ఉండగా, వీటిలో 1,35,789 గృహ విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. వీటిలో ప్రజాపాలనలో జిల్లా వ్యాప్తంగా 15 మండలాల్లోని 335 గ్రామ పంచాయతీల్లో 1,63,647 దరఖాస్తులువచ్చాయి.

జిల్లాలో 1,35,789 గృహ విద్యుత్ కనెక్షను..
జిల్లా వ్యాప్తంగా జిల్లాలో 1,66,774 విద్యుత్ కనెక్షన్లు ఉండగా, వీటిలో 1,35,789 గృహ విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. ప్రతీ నెల జిల్లా వ్యాప్తంగా సుమారు రూ.6 కోట్ల ఆదాయం సమకూరుతుండగా, గృహ వినియోగదారులు విద్యుత్‌శాఖకు రూ.4.5 కోట్ల బిల్లుల చెల్లిస్తున్నారు. సాధారణంగా 200లోగా విద్యుత్ వాడే వినియోగదారులకు యూనిట్‌కు రూ.5.25, రూ.200యూనిట్లపైన యూనిట్‌కు రూ.6 చెల్లిస్తున్నారు. 200 యూనిట్ల లోపు విద్యుత్ వాడే వినియోగదారులకు ప్రతీ నెల సుమారు రూ.800 నుండి రూ.1000 బిల్లు వస్తుంది. ప్రజాపాలనలో 200యూనిట్ల ఉచిత విద్యుత్ కోసం 1,08,383 దరఖాస్తులు వచ్చాయి. ఈ లెక్కన ఉచిత విద్యుత్‌తె జిల్లాలో ప్రభుత్వంపై రూ.8 కోట్ల వరకు భారం పడనుంది. 2022–23 సంవత్సరంలో వాడిన విద్యుత్ వినియోగదారుల ప్రకారం అంచనా వేస్తున్నారు. ఒక కుటుంబానికి ఏడాదికి 6 ఉచిత గ్యాస్ సిలిండర్లు ఇవ్వాలని ప్రాథమికంగా నిర్ణయించినట్లు సమాచారం. ప్రస్తుతం అమలు చేస్తున్న సబ్సిడీ విధానం లాగే గ్యాస్ వినియోగదారుడు పూర్తి డబ్బులు చెల్లించాల్సి ఉంటుంది. అనంతరం సబ్సిడీ వారి బ్యాంక్ అకౌంట్‌లో జమ చేయనున్నట్లు సమాచారం.

200 యూనిట్ల లోపు వారికే వర్తింపు

గృహజ్యోతి పథకం 200యూనిట్ల లోపు వాడితేనే వర్తిస్తుంది. 200యూనిట్లు దాటితే వర్తించదు. రేషన్ కార్డు కలిగి ఉన్నవారే అర్హులు. మార్చి 1 నుంచి పథకం అమలుకు సన్నాహాలు జరుగుతున్నాయి. ఇప్పటి వరకు దరఖాస్తు చేసుకోని వారు ఎంపీడీవో, తహసీల్దార్, మున్సిపల్ కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకోవచ్చు. ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

– వాసుదేవ్, ట్రాన్స్‌కో ఎస్ఈ

ముగిసిన గంగాపూర్ జాతర



ఎమ్మెల్యే కోవలక్ష్మికి పూర్ణకుంభంతో స్వాగతం పలుకుతున్న ఆలయ అర్చకులు

- చివరి రోజు కొనసాగిన భక్తుల రద్దీ
- కిటకిటలాడిన దుకాణాలు

రెబ్బెన: మాఘ శుద్ధ పౌర్ణమిని పురష్కరించుకు ని గంగాపూర్‌లోని శ్రీబాలాజీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం ప్రారంభమైన జా తర ఆదివారం ముగిసింది. మూడు రోజుల పాటు జాతర అంగరంగ వైభవంగా కొనసాగింది. మూడో రోజు సైతం పలు ప్రాంతాల నుంచి భారీగా భక్తులు తరలివచ్చి స్వామి వారిని ద ర్శించుకున్నారు. జాతరలో వెలిసిన దుకాణా లు, రంగుల రాట్నం వద్ద భక్తుల సందడి నెలకొంది. జాతరకు వచ్చిన భక్తులతో దుకాణాలు కిటకిటలాడాయి. మూడురోజుల జాతర సందర్భంగా సుమారు 1.5 లక్షల పైచికులు భక్తులు తరలివచ్చినట్లు అంచనా వేశారు.

ఎమ్మెల్యే దంపతుల పూజలు...
గంగాపూర్ జాతర చివరి రోజున ఎమ్మెల్యే కోవలక్ష్మి కుటుంబ సమేతంగా ఆలయానికి వచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు ఎమ్మెల్యే దంపతులకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం గర్భాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు ఎమ్మెల్యేతో పాటు సిర్పూర్ (యూ) జెడ్పీటీసీ కోవ అరుణలను శాలువాలతో సన్మానించి స్వామివారి కంకణాలు, ప్రసాదాలు అందచేశారు.



ఆలయంలో దేవతామూర్తులను దర్శించుకుంటున్న భక్తులు

సేవాలాల్ మహరాజ్‌కి జై..

- బంజారాల (లంబాడీ) ఆరాధ్య దైవం
- మూగజీవాల ప్రాణదాత
- నేడు జిల్లా కేంద్రంలో జయంతోత్సవం
- విద్యాసంస్థలకు సెలవు ప్రకటించిన కలెక్టర్
- ఏర్పాట్లు పూర్తిచేసిన ఉత్సవ కమిటీ



ఉత్సవాలకు చేస్తున్న ఏర్పాట్లు



సేవాలాల్ మహరాజ్


కెరమెరి(ఆసిఫాబాద్): లంబాడాల ఆరాధ్య దైవం సేవాలాల్ మహరాజ్ జయంతిని జిల్లా కేంద్రంలో సోమవారం ఘనంగా నిర్వహించేందుకు ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తి చేశారు. ప్రతీ సంవత్సరం మాదిరి కాకుండా ఈ ఏడాది మరింత ఘనంగా నిర్వహించేందుకు నాయకులు సిద్ధమయ్యారు. జిల్లా వ్యాప్తంగా సుమారు 2వేల మంది లంబాడాలు వస్తారని అంచనా. ఇప్పటికే ఉమ్మడి జిల్లాలోని కుమురంభీం ఆసిఫాబాద్ మినహా అన్ని జిల్లాలో సేవాలాల్ జయంతిని నిర్వహించారు. ఈ నెల 15 నుంచి సేవాలాల్ జయంతిని జిల్లాలోని అన్ని తండాల్లో నిర్వహిస్తున్నారు. నేడు ఉదయం జిల్లా కేంద్రంలోని ప్రేమలా గార్డెన్ సమీపంలో ఉదయం 11గంటలకు జెండాను ఎగరవేసిన అనంతరం కార్యక్రమాలు చేపట్టనున్నట్లు ఉత్సవ కమిటీ జిల్లా గౌరవ అధ్యక్షుడు రాథోడ్ శంకర్ నాయక్ తెలిపారు. ఈ నేపథ్యంలో నేడు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలకు కలెక్టర్ హేమంత్ బొర్కడే సెలవు ప్రకటించారు.

సేవాలాల్ మహరాజ్ ఎవరూ..?
సేవాలాల్ మహరాజ్ కర్నాటక రాష్ట్రంలోని స్వర్ణ గుంప గుత్తి గ్రామంలో 1739 ఫిబ్రవరి 15న బీమా నాయక్–ధర్మనీ దంపతులకు జన్మించాడు. (ప్రస్తుతం ఆ గ్రామం ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపురం జిల్లాలో ఉంది). మోరమ్మగా పిలువబడే జగదాంబ ప్రత్యక్షమై సేవాలాల్‌ను నాకు అప్పజెప్పమని భీమా నాయక్‌ను కోరుతుంది. అందుకు ఒప్పుకున్న తల్లిదండ్రులు సేవాలాల్‌ను దేవికి అప్పజెప్పుతుంటే తాను ససేమిరా అనడంతో అప్పటి నుంచి సేవాలాల్‌కు ఎన్నో కష్టాలకు గురిచేసిందని, ఆ తరువాత ఆ తండాను సైతం కష్టాలకు గురి చేయడంతో స్థానికులు అతడిని బహిష్కరించారు. దీంతో అమ్మవారిని శాంతింపజేయడానికి ఏడు మేకలను సిద్ధం చేయగా అడ్డుపడగా అతడి తలను ఖండించి అమ్మవారి కాళ్ల వద్ద పడేస్తారు. దీంతో మూగజీవాలపై సేవాలాల్‌కు ఉన్న ప్రేమ, భక్తికి ప్రతిరూపంగా జగదాంబదేవి మళ్లీ సేవాలాల్ తలను జోడించి జీవం పోస్తుంది. అప్పటి నుంచి సేవాలాల్ దుర్గామాత అమ్మవారిని గురువుగా స్వీకరించి అన్ని విద్యలు నేర్చుకుని బంజారాల సేవలో నిమగ్నమయ్యాడని పురాణ గాథలు చెబుతున్నాయి.

12గంటలకు పూజా కార్యక్రమాలు..
నేడు నిర్వహించే సేవాలాల్ జయంతి సందర్భంగా 11గంటలకు పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించనున్నారు. అనంతరం జెండాను ఎగరవేస్తారు. మధ్యాహ్నం 12గంటలకు పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఈ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి, ఆదిలాబాద్ జిల్లా పరిషత్ చైర్మన్ రాథోడ్ జనార్దన్, బంజార సేవా సంఘం రాష్ట్ర నాయకులు హాజరు కానున్నారు.

జయంతిని విజయవంతం చేయాలి
ఆసిఫాబాద్‌రూరల్: సంత్ సేవలాల్ మహరాజ్ జయంతి ఏర్పాట్లను సేవలాల్ ఉత్సవ కమిటీ జిల్లా ప్రధాన కార్యదర్శి శివ ప్రసాద్ ఆదివారం జిల్లా కేంద్రంలో పరిశీలించారు. ఈ నెల 26న సంత్ సేవాలాల్ 285వ జయంతిని జిల్లా కేంద్రంలోని ప్రేమలా గార్డెన్ పక్కన మైదానంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ఇందులాల్, రవీందర్, వివరాం పాల్గొన్నారు.

ఏర్పాట్లు పూర్తి చేశాం..




నేడు జిల్లా కేంద్రంలో నిర్వహించే సేవాలాల్ జయంతి కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. కుమురంభీం, ఆదిలాబాద్ ప్రముఖ నేతలందరూ హాజరువుతున్నారు. సుమారు 2వేలకు పైగా బంజారా, తదితరులు వస్తారని అంచనా. అధిక సంఖ్యలో ప్రజలు, అభిమానులు హాజరై సేవాలాల్ జయంతిని విజయవంతం చేయాలి.

– రాథోడ్ రూప్‌లాల్,
ఉత్సవ కమిటీ జిల్లా ఉపాధ్యక్షుడు

విగ్రహాలను ధ్వంసం చేసిన వారిని శిక్షించాలి

- బీఎస్పీ ఆధ్వర్యంలో రాస్తారోకో



రాస్తారోకో నిర్వహిస్తున్న బీఎస్పీ నాయకులు

కాగజ్‌నగర్‌రూరల్: మంచిర్యాల జిల్లా కోటపల్లి మండలం బోరంపల్లి గ్రామంలో మహాత్మాజ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే విగ్రహాలను ధ్వంసం చేసిన వారిని శిక్షించాలని డిమాండ్ చేస్తూ ఆదివారం కాగజ్‌నగర్–ఆసిఫాబాద్ ప్రధాన రహదారి వంజీరి వద్ద బీఎస్పీ ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా బీఎస్పీ పార్టీ ప్రధాన కార్యదర్శి సిడాం గణపతి, బీఎస్పీ జిల్లా అధ్యక్షులు లెండుగురె శ్యాంరావు మాట్లాడారు. ప్రభుత్వం ప్రగతిభవన్‌కు మహాత్మాజ్యోతిరావు పూలే పేరు పెడితే సరిపోదని, వారి ఆశయాలను అర్థం చేసుకుని వాటిని అమల్లోకి తేవాలన్నారు. విగ్రహాలను ధ్వంసం చేసిన వారిని వెంటనే శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ జిల్లా అధికార ప్రతినిధి నక్క మనోహర్, పట్టణ ఇన్‌చార్జి షబ్బీర్ హుస్సేన్, పట్టణ ఉపాధ్యక్షుడు తన్నీరు పోచం, ప్రధాన కార్యదర్శి సిద్దం శ్రీను, రేణుకుంట్ల శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి పిల్లల తిరుపతి, మాలీ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గొర్రె గోపాల్, బిఎస్పీ నాయకులు గోపి, నరేందర్, రాజేశ్, హనుమంతు, సుధాకర్, రావూజీ, రాజు పాల్గొన్నారు.

4న మున్సిపల్ చైర్మన్, వైస్‌చైర్మన్ ఎన్నిక

- చైర్మన్ పదవి కోసం పలువురి యత్నాలు



కాగజ్‌నగర్ మున్సిపల్ కార్యాలయం

కాగజ్‌నగర్‌రూరల్: కాగజ్‌నగర్ మున్సిపల్ చైర్మన్, వైస్‌చైర్మన్ ఎన్నికకు తేది ఖరారైంది. మార్చి 4న ఎన్నిక నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. గత మున్సిపల్ ఎన్నికల్లో మెజార్టీ స్థానాలను బీఆర్ఎస్ పార్టీ గెలుచుకోగా, చైర్మన్‌గా సద్దాం హుస్సేన్, వైస్ చైర్మన్‌గా రాచకొండ గిరీష్‌లను ఎన్నుకున్నారు. చైర్మన్ సద్దాం హుస్సేన్‌పై అసంతృప్తి నెలకొనగా, మెజార్టీ కౌన్సిలర్లు అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టి నెగ్గారు. అవిశ్వాసం పెట్టడానికి మాజీ మున్సిపల్ చైర్మన్ దస్తగిరి నాయకత్వం వహించారు. మాజీ చైర్మన్ దస్తగిరి బంధువు 19వ వార్డు కౌన్సిలర్ షాహీనా సుల్తానా చైర్మన్ పదవి రేసులో ఉన్నారు. చైర్మన్ పదవిని దక్కించుకునేందుకు మరో ఇద్దరు బీఆర్ఎస్ కౌన్సిలర్లు ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిసింది. అదే విధంగా బీఎస్పీ పార్టీకి చెందిన 9వ వార్డు కౌన్సిలర్ మినాజ్ సైతం చైర్మన్ పదవి రేసులో ఉన్నారు. ఇప్పటికే వీరంతా ఆయా వార్డుల కౌన్సిలర్లతో మంతనాలు సాగిస్తున్నారు. రహస్యంగా ఎవరి ప్రయత్నాలు వారు చేయడంలో నిమగ్నమయ్యారు. చైర్మన్ సద్దాం హుస్సేన్‌ను పదవి నుంచి తొలగించేవరకు కౌన్సిలర్లు అందరూ కలిసికట్టుగా ఉన్నారు. అయితే ప్రస్తుతం చైర్మన్ పదవికి పలువురు పోటీ పడుతుండడం ఆసక్తికరంగా మారింది. మార్చి 4న చైర్మన్ ఎన్నిక జరగనుండడంతో చైర్మన్ పదవి ఎవరిని వరిస్తుందో వేచిచూడాల్సిందే.

క్లుప్తంగా

రైలు ఢీకొని వ్యక్తి మృతి

రామకృష్ణాపూర్: క్యాతనపల్లి రైల్వేగేటు సమీపంలో శనివారం రాత్రి రైలు ఢీకొన్న సంఘటనలో శేషపల్లి గ్రామానికి చెందిన కుర్మ కుమార్ (36) మృతిచెందాడు. మంచిర్యాల రైల్వేహెడ్ కానిస్టేబుల్ రాజేశ్వర్ కథనం ప్రకారం.. గద్దెరాగిడి నుంచి కుర్మ కుమార్ కాలినడకన ఇంటికి వెళ్తున్నాడు. కొత్త బ్రిడ్జి వద్ద పట్టాలు దాటుతుండగా గుర్తుతెలియని రైలు ఢీకొని చనిపోయాడు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదానికి కారణమైన వ్యక్తి అరెస్టు

చెన్నూర్‌రూరల్: మండలంలోని కత్తెరసాల సమీపంలోని బ్రిడ్జి వద్ద ప్రమాదానికి కారణమైన వ్యక్తిని ఆదివారం అరెస్టు చేసినట్లు పట్టణ సీఐ రవీందర్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. కత్తెరసాల సమీపంలో శనివారం బోలెరో వాహనం రెండు బైక్‌లు ఢీకొన్న ఘటనలో కంకణాల దేవేందర్‌రెడ్డి, ఎండీ సైఫ్ అలీ మృతి చెందాడు. బైక్ వెనకాల కూర్చున్న ఎండీ ఆబిద్‌కు తీవ్ర గాయాలు కాగా, చికిత్స పొందుతున్నాడు. మృతుడు దేవేందర్‌రెడ్డి భార్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. మద్యం తాగి బోలెరో వాహనాన్ని అజాగ్రత్తగా నడిపి ప్రమాదానికి కారణమైన కోటపల్లి మండలం పారిపల్లి వాసి గడల తిరుపతిని రిమాండ్‌కు తరలించినట్లు పట్టణ సీఐ రవీందర్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి


మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం రాపల్లి స్టేజీ వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. వివరాలు ఇలా ఉన్నాయి.. లక్సెట్టిపేట మండలం గుల్లకోటకు చెందిన గుర్రాల శ్రీధర్‌రెడ్డి (45) బైక్‌పై మంచిర్యాలలోని హైటెక్‌సిటీలో తన ఇంటికి వెళ్తున్నాడు. ఇదే సమయంలో మంచిర్యాల నుంచి లక్సెట్టిపేట వైపు వస్తున్న ఆటోను బైక్ వేగంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో శ్రీధర్‌రెడ్డి తలకు తీవ్రగాయాలు కాగా మంచిర్యాలలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతిచెందాడు. హాజీపూర్‌కు చెందిన ఆటో డ్రైవర్ మహేశ్‌తోపాటు ప్రయాణికులకు ఎలాంటి ప్రమాదం జరగలేదు. కాగా, ఈ ఘటనపై పోలీస్ స్టేషన్‌లో ఎలాంటి ఫిర్యాదు అందలేదు.

గజ్జలమ్మ దేవికి పూజలు

కుంటాల: కుంటాల ఆరాధ్యదైవం శ్రీ గజ్జలమ్మ ముత్యాలమ్మ మహాలక్ష్మి ఆలయాల్లో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గురుస్వామి జక్కని గజేందర్, అర్చకుడు నగేశ్ ఆధ్వర్యంలో పూజలు చేశారు. మహారాష్ట్రలోని ముంబై, నాందేడ్, బోకర్, ధర్మాబాద్, అప్పారావుపేట్, శివుని, మలక్‌జాం, హిమాయత్‌నగర్, ఇస్లాపూర్ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి పూజలు చేశారు. చిన్నపిల్లలకు తులాభారం, తలానీలాలు అర్పించి మొక్కు చెల్లించుకున్నారు. నిజామాబాద్ జిల్లా బాల్కొండ గ్రామానికి చెందిన గాజుల గోదావరి.. అమ్మవారికి రెండు తులాల వెండిని బహూకరించారు. ఆలయ కమిటీ సభ్యులు ఆమెను సన్మానించారు.

సల్లంగ సూడమ్మా..

- ముగిసిన గాంధారి మైసమ్మ జాతర
- వేలాదిగా తరలివచ్చిన ఆదివాసీలు


ఖిల్లాలోని దర్వాజ వద్ద బారులు తీరిన భక్తులు


కాలభైరవుడి విగ్రహం వద్ద మొక్కులు చెల్లిస్తున్న ఎమ్మెల్యే వివేక్

రామకృష్ణాపూర్: మందమర్రి మండలం బొక్కలగుట్ట శివారులోని గాంధారి ఖిల్లా వద్ద మూడు రోజులుగా నిర్వహిస్తున్న గాంధారి మైసమ్మ జాతర ఆదివారం పెద్దపూజతో వైభవంగా ముగిసింది. మైసమ్మ తల్లిని దర్శించుకునేందుకు ఆదివాసీ నాయక్‌పోడ్‌లు వేలాదిగా తరలివచ్చారు. జాతరలో చివరిరోజైన ఆదివారం తెల్లవారుజాము గాంధారీ ఖిల్లా దిగువ భాగంలో ఉన్న జీడికోట నుంచి మైసమ్మతల్లి వద్దకు ఆదివాసీలు సంప్రదాయ తప్పెటగూళ్ల ఆటలతో, డప్పుచప్పుళ్లతో చేరుకున్నారు. అక్కడ గిరిజనులు తీసుకువచ్చిన గంగాజలంతో దేవతామూర్తులను శుద్ధిచేసి మైసమ్మతల్లి వద్ద పట్నాలు వేశారు. తర్వాత నైవేద్యం పెట్టి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేశారు. ఈ జాతరలో పాల్గొనేందుకు జిల్లాతోపాటు పక్క జిల్లాల నుంచి ఆదివాసీ నాయక్‌పోడ్‌లు, భక్తులు తరలివచ్చారు.

పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దుతా: ఎమ్మెల్యే

గాంధారి ఖిల్లా ప్రాంతాన్ని టూరిజం ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ అన్నారు. మూడు రోజుల జాతరలో ముగింపు ఉత్సవాలకు ఆయన హాజరయ్యారు. ఖిల్లాపైకి వచ్చి కాలభైరవుడి విగ్రహం వద్ద పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జాతర నిర్వహణకు కలెక్టర్‌తో మాట్లాడి రూ.5 లక్షలు ఇప్పించానని అన్నారు. ఖిల్లాలో వెలిసిన మైసమ్మ తల్లి గొప్ప శక్తి స్వరూపిని అని, తెలంగాణ ఉద్యమ సమయంలో ప్రత్యేకరాష్ట్రం రావాలని ఆనాడు అమ్మవారిని మొక్కుకున్నానని గుర్తుచేశారు. ఖిల్లా వరకు బీటీ రోడ్డు నిర్మించేందుకు అటవీశాఖ అనుమతులు అవసరమని ఇందుకు తాను కృషి చేస్తానని చెప్పారు. నియోజకవర్గంలో ట్రైబల్ పాఠశాల ఏర్పాటుకు కృషి చేస్తానని, గాంధారి ఖిల్లాలో భక్తుల సౌకర్యార్థం శాశ్వత ప్రాతిపదికన మంచినీటి ట్యాంకు నిర్మాణాన్ని చేపడుతామన్నారు. అనంతరం నాయక్‌పోడ్‌లు ఎమ్మెల్యేకు పలు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు, క్యాతనపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ జంగం కళ, బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్, మందమర్రి తహసీల్దార్ చంద్రశేఖర్, నాయక్‌పోడ్ సేవాసమితి నాయకులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యేకు వినతిని అందిస్తున్న నాయకులు


మైసమ్మ తల్లికి మొక్కులు చెల్లిస్తున్న భక్తులు


తల్లిని దర్శించుకునేందుకు వస్తున్న భక్తులు

అధ్వానంగా సింగరేణి గార్డెన్


నస్పూర్ కాలనీలోని సింగరేణి గార్డెన్

- నిర్వహణ అస్తవ్యస్తం
- పగిలిపోయిన టైల్స్
- పేరుకే ఏసీ హాల్
- పట్టించుకోని అధికారులు

శ్రీరాంపూర్: నస్పూర్ కాలనీలోని సింగరేణి గార్డెన్ నిర్వాహణ అధ్వానంగా మారింది. కార్మిక కుటుంబాలు వివాహాది, శుభాకార్యాలు చేసుకోవడానికి శ్రీరాంపూర్ ఏరియాలో ఏర్పాటు చేసిన ఏకైక ఏసీ ఫంక్షన్ హాల్ ఇదొక్కటే ఉంది. ఐతే దీని నిర్వహణ సరిగ్గా లేకపోవడంతో శుభకార్యాలు చేసుకునేవారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గతంలో దీన్ని ఓల్డ్ కమ్యూనిటీహాల్ అనేవారు. మూడేళ్ల క్రితం ఇందులో ఏసీలు, టైల్స్ పెట్టి ఇతర హంగు ఆర్భాటాలతో ఆధునీకరించారు. ఇంత చేసిన నిర్వహణను గాలికి వదిలేశారు. హాల్‌లో ఉన్న ఏసీలు కొన్ని పనిచేయడం లేదు. పని చేస్తున్న ఏసీల రిమోట్‌లు మాత్రం జీఎం కార్యాలయంలోనే ఉంటాయి. వాటిని ఆన్‌చేస్తే ఒక్కో ఏసీ ఒక్కో టెంపరేచర్ మీద రన్ అవుతున్నాయి. రిమోట్లు అందుబాటులో లేకపోవడంతో చల్లదనం సరిపడా రావడం లేదు. స్టేజీపై ఉన్న కొన్నిటైల్స్ పగిలిపోయాయి. దీంతో వేదికపై వచ్చి వెళ్లేవారికి కాళ్లకు గాయాలవుతున్నాయి. దీనికితోడు కొన్ని లైట్లు పనిచేయడం లేదు.


పాకురుతో ఉన్న మంచినీటి ట్యాంక్

మురికి పట్టిన డైనింగ్ హాల్..

డైనింగ్ హాల్ అయితే మరింత అధ్వానంగా ఉంది. ఫ్లోర్ సరిగ్గా శుభ్రం చేయకపోవడంతో మురికిపట్టి నల్లగా మారి దుర్గంధం వెదజల్లుతుంది. కిచెన్ ఏరియాలో వంట సామగ్రి, ప్లేట్లు కడుక్కోవడానికి ఉన్న మంచినీటి ట్యాంకు అపరిశుభ్రంగా ఉంది. అందులో చెత్తాచెదారం, పాకురు, ప్లాస్టిక్‌పైపులు అధ్వానంగా మారింది. ప్లేట్లు శుభ్రం చేసుకోవడానికి నీటిని తోడితే అందులో పురుగులు వస్తున్నాయని వంట మనుషులు పేర్కొంటున్నారు. డైనింగ్ సెక్షన్ షెడ్డు ఎత్తు తక్కువగా ఉండటంతో వేసవిలో వేడి, తీవ్ర ఉక్కపోతతో శుభకార్యాలకు హాజరైనవారు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైన దీని నిర్వహణపై ఉన్నతాధికారులు దృష్టిపెట్టి సమస్యలు పరిష్కరించాలని కార్మికులు డిమాండ్ చేస్తున్నారు.

ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.కోటి ఎక్స్‌గ్రేషియా

- నేడు యూబీఐతో సింగరేణి యాజమాన్యం ఒప్పందం

మందమర్రిరూరల్: సింగరేణి ఉద్యోగి ప్రమాదవశాత్తు విధి నిర్వహణలో కాని, బయట గాని మరణిస్తే బాధిత కుటుంబానికి రూ.కోటి ఎక్స్‌గ్రేషియా చెల్లించడానికి యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (యూబీఐ) అంగీకరించిందని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య ఓ ప్రకటనలో తెలిపారు. సోమవారం హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో యూబీఐతో ఒప్పందం చేసుకోనున్నట్లు పేర్కొన్నారు. మృతిచెందిన కార్మిక కుటుంబాలకు రూ.కోటి చెల్లించాల్సిందేనని పలు దఫాలుగా చేపట్టిన ఆందోళనల ఫలితంగా యూబీఐ అంగీకరించిందని తెలిపారు. ఉద్యోగి ప్రతిఏటా రూ.274 అదనంగా చెల్లిస్తే మరో రూ.30 లక్షలు చెల్లించడానికి అంగీకరించారని సీతారామయ్య వివరించారు. సింగరేణి ఉద్యోగులు వివిధ బ్యాంకుల్లో ఖాతాదారులుగా ఉన్నారని తెలిపారు. యూబీఐ మాదిరిగా మిగతా బ్యాంకులు రూ. కోటి ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని లేకపోతే యూబీఐకి వేతనాలు బదిలీ చేసుకోవాల్సి వస్తుందని పేర్కొన్నారు.

ఏఐటీయూసీ కృషితోనే..

కాసిపేట: ఏఐటీయూసీ కృషి ఫలితంగా సింగరేణి కార్మికులు ప్రమాదవశాత్తు మృతిచెందితే రూ.కోటి ఎక్స్‌గ్రేషియా చెల్లించేందుకు యూబీఐ అంగీకరించిందని బెల్లంపల్లి బ్రాంచి కార్యదర్శి దాగం మల్లేశ్ ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య బ్యాంకు అధికారులతో చర్చలు జరిగాయని పేర్కొన్నారు. ఇతర బ్యాంకులు సైతం ఇదే విధంగా ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని కోరారు.

ముగిసిన సెపక్‌తక్రా పోటీలు

నల్లగొండ: నల్లగొండలోని ఎన్జీ కాలేజీలో జూనియర్, సబ్ జూనియర్ అంతర్ జిల్లా సెపక్‌తక్రా చాంపియన్ షిప్‌పోటీలు ఆదివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎండీ మక్బూల్ అహ్మద్ మాట్లాడుతూ క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొని ప్రతిభ కనబర్చారని అన్నారు. అనంతరం గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. ఆర్గనైజింగ్ ప్రెసిడెంట్ ప్రేమ్‌రాజ్, సురేష్ పాల్గొన్నారు.

జూనియర్ బాలుర విభాగంలో రంగారెడ్డి జట్టు ప్రథమ స్థానంలో నిలిచింది. ఆదిలాబాద్ జట్టు ద్వితీయ స్థానం, హైదరాబాద్–నిజామాబాద్ జట్లు సంయుక్తంగా తృతీయ స్థానంలో నిలిచింది. రంగారెడ్డి జట్టుకు 3 బంగారు పతకాలు, నిజామాబాద్‌కు ఒక బంగారు పతకం, ఒక రజతం, ఒక కాంస్యం లభించింది. నల్లగొండ జట్టు ఒక రజతం, ఒక కాంస్యం సాధించింది. ఆదిలాబాద్ ఒక రజతం, ఒక కాంస్యంతో తమ నైపుణ్యాన్ని ప్రదర్శించింది. హైదరాబాద్, వరంగల్ జట్లు చెరో రెండు కాంస్య పతకాలను సాధించగా, మహబూబ్‌నగర్ ఒక రజత పతకాన్ని కైవసం చేసుకుంది.


పతకాలతో ఆదిలాబాద్ బాలుర జట్టు క్రీడాకారులు


విజేతలతో బాలుర క్రీడాకారులు

కళ్లకు గంతలతో బైక్‌లపై అయోధ్యకు

కైలాస్‌నగర్: హైదరాబాద్‌కు చెందిన మెజీషియన్లు మారుతిజోషి, రామకృష్ణ కళ్లకు గంతలు కట్టుకొని అయోధ్యకు బైక్‌లపై యాత్ర చేస్తున్నారు. ఆదివారం ఈ యాత్ర జిల్లా కేంద్రానికి చేరుకోగా వారిని ఎంపీ సోయం బాపూరావు సన్మానించారు. స్థానిక శ్రీ రామచంద్ర గోపాలకృష్ణ మఠంలో జరిగిన కార్యక్రమంలో మఠాధిపతి యోగానంద సరస్వతితో కలిసి పూలమాల, శాలువలతో సత్కరించారు. యాత్రకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా సురక్షితంగా అయోధ్యకు చేరుకుని బాలరాముని దర్శించుకోవాలని ఆకాంక్షించారు. దశాబ్దాలుగా ప్రజలు ఎదురుచూసిన అయోధ్య భవ్య రామమందిర నిర్మాణ కలను ప్రధాని మోదీ సాకారం చేశారని గుర్తు చేశారు. కార్యక్రమంలో పలువురు స్వాములు తదితరులు పాల్గొన్నారు.


యాత్రికులను సన్మానిస్తున్న ఎంపీ సోయం

జాతీయస్థాయిలో గోల్డ్‌మెడల్


గోల్డ్ మెడల్ సాధించిన జిల్లా క్రీడాకారులు

నేరడిగొండ: జూనియర్ జాతీయస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు గోల్డ్‌మెడల్ సాధించారు. బిహార్ రాష్ట్రం పట్నాలో ఈనెల 21 నుంచి 25 వరకు 41వ జూనియర్ జాతీ యస్థాయి సాఫ్ట్ బాల్ చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించారు. ఇందులో అండర్ 23–24 బాల,బాలికలు పాల్గొన్నారు. ఫైనల్‌లో తెలంగాణ, కేరళ జట్లు తలపడ్డాయి. కేరళ జట్టుపై ఒక రన్ తేడాతో విజయం సాధించారు. ఆదిలాబాద్ జిల్లా బాలుర నుంచి అఖిల్, బాలికల నుంచి డి.శిరీష, ఎం.అలేఖ్య, బి.వనిత నేరడిగొండ క్రీడాకారులు పాల్గొని బంగారు పతకాలు సాధించారు. ఎమ్మెల్యే అనిల్ జాదవ్ తోపాటు, ప్రధాన కార్యదర్శి గస్కంటి గంగాధర్, జిల్లా ఎస్‌జీఎస్ కోచ్ ఓ.అఖిల, అసోసియేషన్ సభ్యులు, జిల్లా పేట అధ్యక్ష, కార్యదర్శులు వారిని అభినందించారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

తాంసి: మండలంలోని జామిడి గ్రామంలో షార్ట్ సర్క్యూట్‌తో బుద్ద ప్రకాశ్‌కు చెందిన ఇల్లు దగ్ధమైంది. వివరాలు ఇలా ఉన్నాయి.. బుద్ద ప్రకాశ్ ఉపాధి నిమిత్తం దక్షిణాఫ్రికాలో మెల్ట్ కంపెనీలో అకౌంటెట్‌గా పనిచేస్తూ కుటుంబానికి ఆసరాగా నిలుస్తున్నాడు. గతనెల క్రితం సమీప బంధువుల వివాహం నిమిత్తం గ్రామానికి వచ్చాడు. శనివారం పాలోది గ్రామంలో జాతరకు వెళ్లి వచ్చాడు. రాత్రి ఇంట్లో కుటుంబీకులు, అతను నిద్రకు ఉపక్రమించారు. రాత్రి ఒక్కసారిగా షార్ట్ సర్క్యూట్‌తో మంటలు వ్యాపించాయి. అప్రమత్తమైన కుటుంబీకులు, గ్రామస్తులు మంటలను అదుపుచేసే ప్రయత్నం చేసినా ఫలితం లేకుండా పోయింది. వస్తువులు టీవీ, బీరువాతోపాటు తదితర ఫర్నిచర్ వస్తువులు, రూ.1.22 లక్షల నగదు, సర్టిఫికెట్స్, పాస్‌పోర్ట్ కాలిపోయాయి. సుమారు రూ.5 లక్షల ఆస్తి నష్టం వాటిల్లిందని బాధితుడు తెలిపాడు. తాంసి ఎస్సై శివరాం ఆదివారం ఘటన స్థలాన్ని పరిశీలించి వివరాలు నమోదు చేసుకున్నారు. తమను ఆదుకోవాలని బాధిత కుటుంబసభ్యులు కలెక్టర్‌ను వేడుకుంటున్నారు.


కాలిపోయిన ఇంటిని చూపుతున్న ప్రకాశ్

రక్తకణాలు తగ్గి మహిళ మృతి

లక్ష్మణచాంద: రక్తకణాలు తగ్గి మహిళ మృతి చెందింది. మండలంలోని చామన్‌పెల్లిలో ఈ ఘటన చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. గ్రామానికి చెందిన కొమ్మోజి లక్ష్మి(42)కి శనివారం జ్వరం వచ్చింది. కుటుంబ సభ్యులు ఆమెను నిర్మల్‌లోని ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించారు. వైద్యులు పరీక్షలు చేయగా రక్తకణాలు తగ్గాయని ప్లేట్‌లెట్స్ ఎక్కించాలని తెలిపారు. రాత్రి ఆమెకు ప్లేట్‌లెట్స్ ఎక్కించినా పెరగకపోవడంతో ఆరోగ్యం మరింత క్షీణించింది. కుటుంబ సభ్యులు ఆదివారం ఉదయం 5 గంటల సమయంలో అంబులెన్స్‌లో నిజామాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతిచెందింది. మృతురాలికి భర్త శంకర్, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. సాయంత్రం గ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు.

అదృశ్యమైన యువతి.. బావిలో శవమై..


మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ, ఎస్సై

పెంచికల్‌పేట్: గత రెండు రోజుల క్రితం ఇంటి నుంచి అదృశ్యమైన గుండెపల్లి గ్రామానికి చెందిన యువతి తలండి నిర్మల(26) వ్యవసాయ బావిలో ఆదివారం శవమై తేలింది. కుటుంబీకులు, గ్రామస్తులు తెలిపిన వివరాలు.. గుండెపల్లికి చెందిన నారాయణ–వెంకుబాయి దంపతుల కుమార్తె నిర్మల బెజ్జూర్ మండలంలోని కోయపెల్లికి చెందిన రవికుమార్ గత రెండేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. శుక్రవారం ఇంటి నుంచి నిర్మల అదృశ్యమైంది. కుటుంబ సభ్యులు, బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ దొరకలేదు. ఆదివారం మధ్యాహ్నం వ్యవసాయ బావి సమీపంలో రక్తపు మరకలు, చెప్పులు చూసిన కుటుంబీకులు గ్రామస్తుల సహాయంతో బావిలో వెతకగా మృతదేహం లభ్యమైంది. స్థానికుల సమాచారంతో అక్కడికి చేరుకున్న కాగజ్‌నగర్ డీఎస్పీ కరుణాకర్, కాగజ్‌నగర్ రూరల్ సీఐ నాగరాజు, పెంచికల్‌పేట్ ఎస్సై కొమురయ్యలు మృతదేహాన్ని పరిశీలించారు. ప్రేమించిన యువకుడే నిర్మలను హత్య చేసి బావిలో పడేసినట్లు మృతురాలి తండ్రి ఆరోపించారు. అతని ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వాహనం ఢీకొని ఒకరికి గాయాలు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మండలంలోని గుడిపేట వద్ద శనివారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఎస్సై సురేశ్ కథనం ప్రకారం..గుడిపేటకు చెందిన దొరిశెట్టి రాజయ్య తన బైక్‌పై మంచిర్యాలకు వెళ్లి తిరిగి ఇంటి వస్తున్నాడు. లక్సెట్టిపేట నుంచి మంచిర్యాల వైపు వస్తున్న గుర్తు తెలియని వాహనం వేగంగా వచ్చి బైక్‌ను ఢీ కొంది. రాజయ్యకు తీవ్ర గాయాలు కాగా మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి పంపించారు. రాజయ్యకు వరుస సోదరుడు సూర్యప్రకాశ్ ఫిర్యాదుతో ఆదివారం కేసు నమోదు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఒకరికి గాయాలు

నిర్మల్: సారంగాపూర్ మండలం అడెల్లి గ్రామంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలు..మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా మాలోజీ గ్రామానికి చెందిన రేయింద్ల సాయినాథ్(40) బైక్‌పై అడెల్లిలోని తన బంధువుల శుభకార్యానికి వచ్చాడు. తిరిగి స్వగ్రామానికి బయల్దేరాడు. ఈ క్రమంలో అడెల్లి చేరుకోగానే గుర్తుతెలియని ఆటో బైక్‌ను ఢీకొట్టింది. సాయినాథ్ కుడికాలికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రుడిని అంబులెన్స్‌లో నిర్మల్ ఏరియా ఆసుపత్రికి తరలించారు.

రెండోరోజు టీసీసీ పరీక్ష

మంచిర్యాలఅర్బన్: టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు (టీసీసీ) పరీక్ష రెండోరోజు ఆదివారం ప్రశాంతంగా జరిగాయి. జిల్లాకేంద్రంలో జెడ్పీ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన పరీక్ష కేంద్రంలో డ్రాయింగ్ లోయర్, హైయర్ పరీక్షలు నిర్వహించారు. ఉదయం పరీక్షకు 513 మందికి గాను 367 మంది హాజరయ్యారు. మధ్యాహ్నం నిర్వహించిన పరీక్షకు 513 మందికి గాను 366 మంది హాజరైనట్లు డీఈవో యాదయ్య తెలిపారు. పరీక్ష కేంద్రాలను ఏసీజీఈ దామెదర్‌రావు పరిశీలించారు.

గోదావరి తీరంలో స్వచ్ఛభారత్

భైంసా: బాసర గోదావరి నదితీరంలో సంత్ నిరాకారి నిజామాబాద్ శాఖ సంయోజిక్ లక్ష్మణ్ నేతృత్వంలో ఆదివారం స్వచ్ఛభారత్ నిర్వహించారు. సభ్యులంతా గోదావరి నది పరీ వాహక ప్రాంతాల్లో, స్నానఘట్టాల వద్ద చెత్తను తొలగించారు. దశరథ మహారాజ్ ఆశ్రమ పరిసర ప్రాంతాల్లో శుభ్రత కార్యక్రమాలు చేపట్టారు. 100 మంది సభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

కుక్కలదాడిలో చిన్నారులకు గాయాలు

తానూరు: మండలంలోని తొండాల గ్రామంలో ఆదివారం వీధి కుక్కల దాడిలో ముగ్గురు చిన్నారులకు గాయాలయ్యాయి. చిన్నారులు ఆడుకుంటుండగా ఆదిత్య, సాయినాథ్, విలాస్‌పై వీధి కుక్కలు దాడి చేసి గాయపర్చింది. కుటుంబీకులు వారిని ధర్మాబాద్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు.

కొనసాగుతున్న ‘కడెం’ మరమ్మతులు


గేజ్ రూం సమీపంలో డ్రిల్లింగ్ పనులు


గుంత పూడ్చుతున్న పొక్లెయిన్

కడెం(ఖానాపూర్): కడెం ప్రాజెక్ట్ మరమ్మతు పనులు కొనసాగుతున్నాయి. భారీ వరదలకు దెబ్బతిన్న స్పిల్‌వే కింది ప్రాంతాన్ని సిమెంట్ కాంక్రీట్‌తో ఎడమ కాలువ వద్ద కోతకు గురైన ప్రాంతాన్ని మొరంతో పూడ్చారు. నూతన ప్రాజెక్ట్ నిర్మాణానికి సాధ్యాసాధ్యాలపై గతంలో ఢిల్లీ బృందం సూచించిన ప్రాంతాల్లో డ్రిల్లింగ్ పనులు కొనసాగుతున్నాయి. గత ప్రభుత్వంలో విడుదలైన రూ.కోటి నిధులతో మరమ్మతు పనులు కొనసాగుతున్నట్లు అధికారులు వెల్లడించారు.

నేడు సమీక్షా సమావేశం

కడెం ప్రాజెక్ట్ మరమ్మతులపై ఈఎన్‌సీ జనరల్ అనిల్‌కుమార్ సోమవారం హైదరాబాద్‌లో ఇరిగేషన్ శాఖ ఉన్నతాధికారులు, మెకానికల్ టీం, ప్రాజెక్ట్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించనున్నారు. ఇందులో ప్రాజెక్ట్ స్థితిగతులపై పూర్తి రిపోర్ట్‌ను అందించనున్నట్లు డీఈ బోజదాసు తెలిపారు.

వైర్లనూ వదలడం లేదు..!

భైంసాటౌన్: పట్టణంలో చిల్లర చోరీలు ఎక్కువవుతున్నాయి. ఇటీవల గుజిరిగల్లి, బ్రాహ్మణగల్లిలో ఇళ్ల ముందు నిలిపిన ద్విచక్రవాహనాల టైర్లను ఎత్తుకెళ్లారు. తాజాగా పంటచేలల్లో బోరు మోటార్ల వైర్లు సైతం చోరీకి గురయ్యాయి. పట్టణంలోని పార్డి(బి) బైపాస్ రోడ్డులోని పంట చేలల్లో నుంచి రాత్రివేళల్లో వైర్లు ఎత్తుకెళ్లినట్లు బాధిత రైతులు పేర్కొంటున్నారు. ఇలా దాదాపు పది నుంచి పదిహేను బోర్ల మోటారు వైర్లు చోరీకి గురైనట్లు తెలిపారు. గతంలో సైతం ఇలాంటి ఘటనలు జరిగినట్లు రైతులు చెబుతున్నారు.


భూమిలోపలి నుంచి బోరుకు ఉన్న వైరును ఎత్తుకెళ్లిన దృశ్యం